

# అపరాధి

సి. సోమయాజులు

న్యాయమూర్తి నిశితమైన తీర్పు ప్రజాబాహుళ్యంలో ఏవిధమైన విచారం కలిగించలేదు. హర్ష మందహాసాలతో ఆత్మ శాంతితో తీర్పును పొగుడుకుంటూ నడుస్తున్న ఆ జన బాహుళ్యంలో నేనొక్కణ్ణే దోషిలా సంచరించే ననుకుంటాను. అపరాధియొక్క నేరం నిరూపించబడి మరణశిక్ష విధించబడింది. న్యాయం సక్రమంగానే నెరవేర్పబడింది. కాని ధర్మం ఎంతవరకు నెగ్గిందో అన్న ప్రశ్నకు ప్రత్యుత్తరం వెల్తిగానే ఉంది. కాని హత్యాపరాధం సక్రమంగా రుజువుచేయబడిన తరవాత ధర్మాధర్మ పరిపాలన ప్రజా బాహుళ్యం లెక్కించదు. అపరాధి నేరం చేసేడు. సక్రమంగా న్యాయస్థానంలో విచారింపబడ్డాడు. నేరం రుజువైన తరవాత యిక శిక్ష విధించడంలో తప్పేముంది? ఇంతకంటే ప్రజాసామాన్యానికి ఎక్కువ అక్కర్లేదు. అంచేతనే నేరం రుజువవుతూంది. కాని నేరస్థుడు శిక్షలేకుండా ధర్మశాస్త్రం కన్నులు కప్పుతున్నారు. ఇంతచర్చ ఎంతమంది చేస్తారు. నేనుమాత్రం ఎందుకు చెయ్యాలి? నాలో ఏదో ఒక అంతర్వాణి చెప్తూనే ఉంది- అపరాధి నేరస్థుడు కాదని. కాని నే నేం ఉపకారం చేయగలను ఆ దురదృష్టవంతుడికి. నా దౌర్బల్యాన్ని నే నిందించుకొని ప్రయోజన మేముంది? ఇలా నా ఆలోచనలు తుది మొదలు లేకుండా పరిగెడుతున్నాయి. వాటిని ఎంత ప్రయత్నించి ఆపుదల చేద్దామన్నా నా శక్యం కాకుండా ఉంది. ఇంతలో నేను ప్రజల్లో ఉన్నట్టు. మేల్కొలిపింది, ప్రక్కనుండి శరవేగంతో పోతూఉన్న పోలీసులారీ. అపరాధి లారీ కటకటాల్లోంచి శూన్యదృక్కులతో చూస్తున్నాడు. ఎందుకో అతనిమీద నాకు అవ్యాజమైన ప్రేమ సమకూరింది. క్లాక్ టవర్ ఆరుగంటలు కొట్టింది. ఆనాటి వార్తలు పత్రికాలయానికి అందజేయాలన్నమాట గుర్తుకు వచ్చి గమనముఖం మార్చేను.

* * *

క్లాక్ టవరు పది కొడుతూంది. నేను సెంట్రల్ జయిలు సింహద్వారం చేరుకునేసరికి. ఇద్దరు జమానులు పహరా కాస్తున్నారు. 'హాల్టు, ఎవరావెళ్లేది' అని గట్టిగా అరిచేడు ఒక జమాను, తుపాకీ మాటలతోబాటు సంధిస్తూ. 'ఒక మిత్రుడు' అన్నా నేను. అతడు నన్ను దగ్గరగా రానిచ్చేడు. ఆముఖం నాకు పరిచయమే. అతడు నన్ను గుర్తించేడు కాబోలు. 'ఇంత రాత్రివేళ పైవారెవరు యీ ఆవరణలోకి రావడానికి వీలులేదని మీకు తెలుసుండే ఎందుకు వచ్చేరు?' అన్నాడు, కొంచెం వినయంతో. ఆతని కంఠస్వరంబట్టి జైలరువచ్చే కాలం అయిందనుకొన్నాను.

'జైలరు రౌండ్సుమీద ఉన్నాడా?' అన్నాను.

'ఔను' అని భయంతో ప్రత్యుత్తరమిచ్చాడు.

అతని మాటలు యింకా పూర్తి అవలేదు. ఒక చేత్తో రివాల్వరు, రెండవచేత్తో టార్చిలైటు పట్టుకుని నాపాలిటి యమధర్మరాజులా మావైపునకే వస్తున్నాడు జైలరు. నేనప్పుడు భయపడితే లాభం లేదని నిశ్చింతగా సిగరెట్టు తీసి వెలిగించేను. అగ్గిపుల్ల యింకా ఆరనేలేదు, టార్చిలైటు కాంతి నా ముఖంమీద స్పష్టంగా పడి నాకళ్లు ఒక్కసారిగా బలవంతాన్ని మూయించింది. ఆ మిఱుమిట్లలో చెయ్యి కాలి, 'బ్రూట్' అన్న మాట అప్రయత్నంగా నోరు జారింది. తన్నేకదా అన్నానని నా ఆపాదమస్తకం లైటువేసి పరిశీలించి, "ఈ సమయంలో నువ్వు యిక్కడకు రావడం దేనికి? ఈ పరిసర ప్రాంతాల్లో రాత్రి ఏడుకు పైన ఎవరు వచ్చినా మరుసటి ఉదయంవరకూ విడిచిపెట్టడానికి వీల్లేదని మాకు ఉత్తరువు జారీ చేయబడింది" అని సాభిప్రాయంగా చూచేడు జమానువైపు. జమాను

ఏదో చెప్పబోయాడు, కాని నా సంజ్ఞతో ఊరుకున్నాడు.

ఇద్దరు జవాన్ల మధ్య నన్నుంచి ముందు దారి తీసేడు జైలు అధికారి. నా తలలో అప్పుడే ఆలోచనలు పరిగెడుతున్నాయి. నేను వచ్చినపని ఒకటి. జరుగుతున్నది ఇంకొకటి. నాకు తెలిసిన జమాను మూలంగా జైల్లోకి వెళ్ళి తెల్లవారకమునుపే అపరాధి చరిత్ర తెలుసుకుందామని వచ్చినవాణ్ణి ఇప్పుడు తెల్లవారేవరకు ఖైదీగా ఉండవలసిన అగత్యం కలిగింది. తప్పించుకునే విధానం ఏమీ కనిపించలేదు. నేనెవరో అతనికి చెప్పడంనాకప్పుడు ఇష్టం లేకపోయింది. సరే దైవానుగ్రహం నా మీద యీ విధంగా ఉన్నప్పుడు నేనేం చేయగలనని జరగబోయేదానికి కర్మబద్ధుడ నవుతానని ఊరుకొన్నా.

ఇరవైయో శతాబ్దం యించుమించుగా సగం పూర్తి కావచ్చింది, కాని జైల్లో మాత్రం విద్యుచ్ఛక్తి యింకా చెరబెట్టబడలేదు- పోనీ దాన్నైనా స్వేచ్ఛగా వదిలివేసింది ప్రభుత్వం. రెండు నూనె గుడ్డలతో చుట్టబడిన కాగడాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి, సింహద్వారం దగ్గర. జైలరు అప్పుడైనా నాముఖం చూస్తాడేమో అనుకున్నా. నా ముఖంవైపు మాట్లాడకుండా నడుస్తున్నాడతడు. అది శ్మశానవాటికా అనిపించింది. అప్పుడే ఒక ఫర్లాంగు నడిచిఉంటాము మేము. 'గార్డ్ గదికి ప్రక్కగదిలో ఎవరైనా ఉన్నారా?' అన్నాడు జైలరు, జమానువైపు చూడకుండానే. 'గార్డుగది ప్రక్కగదినిండా రాజకీయ ఖైదీ లున్నారు" అన్నాడు, జమాను వినయ విధేయత లుట్టిపడుతున్నట్లు. జైలరు తనలో తాను గొణుక్కుంటున్నాడు. ఏమిటి చెప్మా, విందామని కర్ణరంధ్రాల్ని పెద్దవిగా జేసేను. అస్పష్టంగా అంటున్నాడు. పాపం తనకే భయమేమో గట్టిగా అనడానికి. అయినప్పటికి కొంత గ్రహించగలిగాను. "విచారణలేదు, గిచారణ లేదు. ఎంతకాలం వారినిలా మా పీకలమీద ఉంచుతారో తెలీటం లేదు. గట్టిగా గదులేవీ ఖాళీగా లేవంటే మన ఉద్యోగానికే స్వస్తి చెప్పుకోవాలి' అన్నాడు జైలరు. పాపం! ఎవరి కష్టసుఖాలు వారివి! అనుకున్నాను. రెండు మూడు వార్డులు తిరిగేము. కాని నా దురదృష్ట వశాత్తు జైల్లో కూడా గది ఖాళీలేకపోయింది. చివరకు విసుగెత్తి జైలు చివరని ఉన్న కొట్లలోకి తీసుకు వెళ్ళేడు. నాలుగు కొట్లు వరుసగా ఉన్నాయి. నాకెందుకో కొంచెము భయంకలిగింది. మర్నాడు ఉరితీసేవాళ్ళను ఉంచే గదులు! అవి. 'తాళంవేసిరా' అని జమానుకు తాళాలిచ్చి తను కొంచెం దూరంలో నిలబడ్డాడు, తనకా గదులమీద ఉండే అసహ్యాభావాన్ని సూచించినట్లు. "బాబూ, నేను తాళం వెయ్యటంలేదు. కప్ప దగ్గరగానొక్కి ఉంచేను. మీరు మాత్రం ఉదయంవరకు యిక్కడనుంచి కదలకండి" అంటున్నాడు, జమాను. ఇంకా ఏమో చెప్పబోతున్నాడు కాని మాట ఆపివెయ్యాలసి వచ్చింది. "ఏం, యింకా తాళం పడలేదూ" అన్నాడు జైలరు పెద్ద గొంతుకతో. "బాబూ జాగ్రత్త. అధికారి ముక్కోపి" అని వెళ్ళిపోయేడు జమాను. టార్చిలైటు కాంతి రానురాను సన్నగిల్లి పూర్తిగా అంతరించింది. నేనొకసారి గట్టిగా ఊపిరి తీసుకున్నా. అగ్గిపెట్టె తీసి వెలిగించిచూచేనొకసారి మందిరాన్ని పరిశీలిద్దామని. ఒక పింగాణీ మూకుడూ, ఒక గిన్నె, ఒకకర్రమంచం ఉన్నాయి. ఆ మంచం చూడగానే నాప్రాణం ఒక్కసారి ఎగిరి గంతేసింది. ఇంతలోనే నేవెలిగించిన అగ్గిపుల్ల ఆరిపోయింది. గది కటకటాలధగ్గరకు వెళ్ళి ముందున్న విశాల స్థలంలోకి చూస్తున్నా. క్లాక్ టవర్ నించి పదకొండు గంటలు వినిపించాయి. ఆకాశం వైపు చూచేను. చంద్రుడప్పుడే ఉదయించాడు. ఆ అంధకారాన్ని కొంత తగ్గించడానికా? నాకు తోడులేరన్న భయం తీసివేయడానికా? నేనలా ఆవెన్నెలవైపుచూస్తూ ఊహావీధిలో లీనమయ్యేను. నేనలా ఎంతసేపు ఉన్నానో తెలియదు. నాకు చైతన్యం కలిగించింది "ఎవరా నిర్భాగ్యులు?"అన్న మాట. ఆ నిర్మానుష్య ప్రదేశంలో మాట వినిపించేసరికి త్రుళ్ళిపడ్డాను, ఒక్కసారి నామనస్సు బెదిరింది. అమ్మమ్మ చెప్పిన కథలు నిజమేమో అనుకున్నా. నిజంగా భూతాలున్నాయా? ఏమో. నేనున్న ప్రదేశం అటువంటిదే. ఆతలంపుతో నాకు ఎక్కడలేని ముచ్చెమటలూ పోసేయి. ఎక్కడలేని భయం ప్రవేశించింది. కాని వెంటనే నాభయానికి నాకే నవ్వువచ్చింది. దగ్గరగా నొక్కి ఉంచిన కప్ప, కటకటాలలోంచి చేతులుపెట్టి ఊడదీసి గది పైకివచ్చి యింకొక అగ్గిపుల్ల వెలిగించేను. నాకు ఆశ్చర్యం కలిగింది. నాగది ప్రక్కగది ఖాళీగాలేదు.

అంతకన్నా ఆశ్చర్యంవేసింది, ఆ గదిలో వున్న ఖైదీని చూడగానే. కటకటాల దగ్గరగావెళ్లి అడిగాను, "మిమ్మల్ని యింత త్వరలో ఇక్కడకు మార్చడానికి కారణం?" అని అడిగేను. లోపల నుంచి అతను చాలాప్రశాంతంగా జవాబుచెప్పేడు, 'నా మరణశిక్ష ఏవిధంగా అయితే ఉచ్చరించబడిందో ఆవిధంగానే యిదీ జరిగింది" అని. "కాని మరణశిక్ష విధించినప్పటికీ కొంతకాలం వ్యవధి యివ్వక మానరే. ఇంత త్వరగా శిక్షను అమలు జరపడం అన్యాయం" అన్నాను. 'ఆవేశపడకండి. ఇదీ ఒకందుకు మంచిదే. మరణిస్తామన్న భయంతో రోజు రోజూ కృశిస్తూ ఉండి, వెయ్యిసార్లు మరణించేకన్నా యిది ఉత్తమం కాదూ? మరణించే జీవికి ఒక గడియైతేనేమి, పది దినాలైతేనేమి- ఒకసారి తను మరణిస్తాడని నిశ్చయమైన వార్త తెలిసిన తరువాత! హృదయం దౌర్బల్యం చెందక మునుపే మరణం రావడం మహాపుణ్యం" అన్నాడు. అతని ధైర్యానికి నా కాశ్చర్యం కలిగింది. 'కాని యిది చాలా అన్యాయం' అన్నాను. "న్యాయాన్యాయ పరిశీలనకోసం ప్రభుత్వం ఉన్నప్పుడుగదా యిది న్యాయం, యిది అన్యాయం అని చెప్పగలిగే అవసరం" అన్నాడు. అతని మాటల్లో నిష్ఠూరం ధ్వనించింది. ప్రపంచంమీద అతనికి విరక్తి కలిగినట్లు తోచింది, అతని మాట. "మీరు యింతకీ ఖైదీ కారన్నమాట" అన్నాడతడు. "కాదు" అన్నాను. "అట్లయితే మీకీ చెర ఎట్లా ప్రాప్తించింది? ఈ స్థానానికిన్ని ఆ పరమపదానికిన్ని నలభైగజాలే!" అన్నాడతడు, అతి చులకనగా. అక్కడకు నలభైగజాల దూరంలో ఉంది ఉరి తీయబడే స్థానం.

"నేను మీ విషయమయే ఇక్కడకు వచ్చాను. మీరు దోషులు కారని నా అంతర్వాణి చెప్తూంది. మీ చరిత్ర అడిగి తెలుసుకుందామని ఇక్కడికి వచ్చేను. కాని నా దురదృష్టమని అనుకొన్నా నేను యీ గదిలో బంధించబడ్డం. నా అదృష్టంకిందే మారింది. నాపేరు శిరీష్. నేను "హెరాల్డ్" పత్రికకు ఛీఫ్ రిపోర్టర్ని. మీ ఉదంతం సర్వం తెలుసుకుందామనే వచ్చేను. నా చాతనయినంతవరకు మీకు సహాయపడడానికి ప్రయత్నం చేస్తాను" అన్నాను. అతడు కాసేపు ఉండి "మీరు నా కే విధమైన సహాయం చెయ్యనని వాగ్దానం చెయ్యండి", అన్నాడు. అతనీ మాటలు ఒక ధృఢ నిశ్చయాన్ని వెలిబుచ్చేయి. జీవితం మీద సంపూర్ణ అసహ్యం కలిగిం దనికి, అని తెలుసుకున్నా. కటకటాల్లోనుండి అతడు చెయ్యి పైకి చాపేడు. అతని చేతిని నేను గట్టిగా పట్టుకున్నా, అతను దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు. "కాని శిరీష్ మహాశయా, నా చరిత్ర చెప్పి మీకు సంఘంమీద ద్వేషంకలిగించి మరొక అపరాధిని చేసినవాడ నౌతానేమో అన్న భయం కలుగుతూంది. ప్రస్తుతం మీకు సంఘంమీద గౌరవముంది. ఇంకా మానవుల్లో మీకు విశ్వాసం ఉంది. నా చరిత్ర చెప్పి మీకు ఆ గౌరవాన్ని, విశ్వాసాన్ని, పోగొట్టదలచుకోలేదు" అన్నాడు అతను. ఎంతో ప్రాధేయంగా "మీ చరిత్ర వినందే నే నిక్కడనుంచి వెళ్లను. నిశ్చింతగా చెప్పండి" అన్నాను. అతడు రెండు నిమిషాలు మౌనం వహించేడు.

* * *

"నే నొక రైతు కుటుంబంలో జన్మించేను" అని ప్రారంభించా డతను. "నా తండ్రి చాలా బీదరైతు. మా గ్రామ రైతుల్లో మా కుటుంబం చాలా పేదరికం అనుభవిస్తూ ఉండేది. నా తండ్రికి ఒక ఎకరం పొలం ఉండేది. మా గ్రామం జమీందారీలో చేరినదవడంవల్ల జమీందారుగారి భూముల సాగుబడి ఆ గ్రామం రైతులందరూ చెయ్యవలసిందే. కుప్ప నూర్పులు వచ్చినప్పుడు మాకుప్పలు నూర్చకముందే మేము జమీందారువారి కుప్పలు నూర్చాలి. ఆయనకి తన భూములు ఏదిక్కున ఉన్నాయో కూడా తెలియదు. తరుచు భూములను తణిఖీ చెయ్యడానికి, శిస్తులు వసూలుచెయ్యడానికి మేనేజరు వస్తూ ఉండేవాడు. అతనితోబాటు జమీందారుగారి కుమారుడు కూడా వస్తూ ఉండేవాడు. మే మిద్దరం సమవయస్కులం. నేనెప్పుడూ కూడా అతనితో మాట్లాడేవాడిని కాను. అతనికి నేను నమస్కారం చెయ్యలేదనీ, అతని హోదాకు తగ్గ గౌరవం జూపలేదనీ చాలా కోపంగా ఉండేది. చాలాసార్లు మేనేజరు యీమాట మాతండ్రికి చెప్పేవాడు. మాతండ్రి కోపం ఆపుకోలేక నన్ను అనేకసార్లు చావకొట్టేవాడు. మాతల్లి పోవడంచేత నా చెల్లెలే అడ్డుపడేది. నాతండ్రి తన అహంకారమంతా నామీదచూపి అర్థరాత్రివేళ లేచి గుడ్డిదీపందగ్గర భాగవతం చదువుతూ ఏడ్చేవాడు.

నేను చాలాసార్లు యిది గమనిస్తూవచ్చేను. నాకు దుఃఖం ఆగేదికాదు. తిరిగి నా గడ్డిపరుపులో దూరి వెక్కి వెక్కి ఏడుస్తూ ఉండేవాణ్ణి. ఒక రోజున మా నాన్నా చెల్లెలూ మాట్లాడుకొంటున్నారు. "అయితే, బాబా, అన్నయ్యను ఎప్పుడూ అలా కొడతావేమి? చిన్న బాబుకు నమస్కారం చెయ్య నంతమాత్రాన నువ్వెందుకు కొట్టాలి? చిన్నబాబు అన్నయ్యకు ఎందుకు నమస్కారం చెయ్యకూడదు? అలా చెయ్యనందుకు వాళ్ల నాన్న చిన్నబాబుని ఎందుకు కొట్టడూ?" అని అడిగించి లచ్చి. "వెర్రి తల్లీ! మనం ఎక్కడ! వారెక్కడ! ఏనుగకీ దోమకీ ఎంత తేడా ఉందో, మనకీ వారికీ అంత తేడా ఉంది. చిన్నబాబు గొప్ప కుటుంబంలో పుట్టెను. ఆగర్భ శ్రీమంతు డతడు. అన్నయ్య గర్భదరిద్రుడు. అంతే కాదు అన్నయ్య మనింట్లో పుట్టాడు. అంచేత నే నే పని చేస్తే, వాడూ ఆపనే చెయ్యాలి" అన్నాడు, మా నాన్న. "ఈమాటలు మాత్రం నువ్వింకెవరితోనూ అనకేం, అమ్మా! మనకున్న ఎకరం పొలంకూడా పోగొట్టుకున్న వాళ్లమౌతాం" అన్నాడు మా చెల్లెల్ని బుజ్జగిస్తూ. గోడ చాటునుంచి అంతా విన్నాను. నాకు అప్పుడు బోధపడింది నాకూ, చిన్నబాబుకూ ఉన్న తారతమ్యం. మా నాన్న కున్న భయంకూడా విన్నాను. ఔను- బాధ్యత ఉన్నవాడతను. మా కుటుంబం పోషింపవలసిన బాధ్యత అతనిపై ఉంది. మర్నాడు నుంచీ చిన్నబాబుకు నమస్కారం చెయ్యడం, అతడు కూర్చుంటే నే నిలబడటం మొదలుపెట్టేను. అతడు నా క్రొత్త నడవడి చూచి నవ్వడం, హేళన చెయ్యడం, నేను మాట్లాడినప్పుడు 'చిత్తం, చిత్తం' అనడం చేసేవాడు. నాకు అతణ్ణి కొడదామా అని పించేది. కాని, ఎకరం పొలం పోతుందన్న భయం నన్ను వెనక్కు లాగేది.

ఒకరోజున మాతండ్రి దేవిడీకి తీసుకు వెళ్తానని నన్నూ, నా చెల్లెల్నీ బయలుదేరతీసేడు. మమ్మల్ని ద్దర్ని పైనివున్న అరుగుమీద ఉండమని తను లోప లికి వెళ్లేడు. ఈలోపుగా చిన్నబాబు కారులోవచ్చి దేవిడీ ముందర ఆగేడు. నాకు కుతూహలం ఉండ బట్టక కారుదగ్గరకు వెళ్లి 'ఎంత నున్నగా ఉందో చూద్దామని మీద చెయ్యివేసి రాసేను. 'చెయ్యి తియ్యి' అని కేకవేసేడు చిన్నబాబు. నేను తేలు కుట్టినవాడికిమల్లే చెయ్యి వెనక్కి తీసేసాను. అంత టితో ఊరుకోక అతను డ్రయివరుచేత నన్ను కొట్టించేడు. ప్రక్కనంతా కొంతమంది రైతు లున్నారు. వారివైపు చూచేను- వారేమైనా అడ్డొ స్తారేమో, నాకు జరిగే అన్యాయానికని. వారిలో మానుషత్వం సంపూర్ణంగా నశించింది. పైగా నన్ను మందలించేరు. నాకు ఎక్కడలేని దుఃఖం వచ్చింది. కాని కష్టంమీద ఆపుకొన్నాను. కార్లో ఎక్కి గెంతులు వెయ్యడానికి నోచుకొన్న చిన్నబాబు- ఎలా ఉంటుందో అన్న ఉత్సాహంతో చెయ్యి వేసిన నన్ను కొట్టించాడంటే నా ఒళ్లు మండుకు పోయింది. నేను చెల్లాయివైపు చూసేను. చెల్లాయి దివాణం గోడమీంచి ఇవతలి ప్రక్కకు వ్రాలిన కొమ్మనుండి ఒక పువ్వు తెంపింది. లోపలనుంచి తోటమాలి పరుగెత్తుకొని వచ్చి పువ్వు లాక్కొని లచ్చిని చెంపమీద కొట్టేడు. లచ్చి యేడవలేదు. నెమ్మదిగా నిచ్చినదగ్గర నిలు చుంది. "పాపం కొట్టేడా?" అన్నాడు చిన్నబాబు హేళనగా. రైతులందరు నవ్వేరు. నాకు సిగ్గేసింది. ఈ సంఘటనలన్నీ నా చిన్నతనంలో జరిగినవి" అన్నా డతను.

క్లాకుటవరునుండి పన్డ్రెండు గంటలు వినిపిం చేయి.

"నా జీవిత వ్యవధి యింక అరున్నర గంటలు మాత్రమే" అన్నాడు, అతి సునాయాసంగా. "నాకు యిరవై యేళ్లు వచ్చాయి. నా తండ్రి పొలంమీద పని అంతా నేనే చేస్తూ ఉండేవాణ్ణి. లచ్చికి పదహారు సంవత్సరాలు. మాతండ్రి లచ్చి వివాహ ప్రయత్నాలు చేస్తున్నాడు. కానిఎక్కడా సంబంధం స్థిరపడలేదు.

ఒకరోజున నేనూ, లచ్చి, మా నాన్న పొల ములో ఉన్నప్పుడు- చిన్నబాబు, చిన్నబాబు చెల్లెలు హేమమ్మ, యింకా యిద్దరు ముగ్గురు బంధు వులతో షికారుగా వచ్చేరు. చిన్నబాబు పొలం అంతా నన్ను చూపించమన్నాడు. చూపించేను. చిన్నబాబూ వారూ వెళ్లిపోయేరు. హేమమ్మ లచ్చిని చూచి లచ్చిని దివాణం రమ్మనమంది, కాని లచ్చికి దివాణం వెళ్లడమంటే కష్టంగా ఉండేది. హేమమ్మ అడిగినప్పుడు లచ్చిని పంపకపోతే అగౌరవంగా ఉంటుందని భయంచేత మా నాన్న లచ్చిని వెళ్లమన్నాడు. లచ్చి నా తండ్రిమాట

త్రోసివెయ్యలేక దివాణం వెళ్తానంది. నేనే స్వయముగా దివాణంలో దిగబెట్టాను. హేమమ్మ నన్ను కూడా అక్కడే ఉండమంది. ఆమెను చూచినప్పటినుండి నాకొకవిధమైన భయం కలుగుతూ ఉండేది. దానికికారణం నేనేమీ చెప్పలేను. లచ్చి, నేను తిరిగి యింటికి వస్తూ ఉన్నప్పుడు లచ్చి అంది. “అన్నయ్యా! నువ్వంటే హేమమ్మకు చాలా అభిమానం సుమా! ఆమె దగ్గరఉన్న బొమ్మల పుస్తకంలో నీ ఫొటోలుకూడా ఉన్నాయి. మా అన్నయ్య బొమ్మలెందు కిక్కడ ఉన్నాయంటే, మీ అన్నయ్య చాలా అందంగా ఉంటాడు కాబట్టి అని నవ్వుతూ అంది.”

నాభయం ఎక్కువ అవుతూ వచ్చింది. నాకు ఏదో నెపంమీద రోజుల తరబడి దివాణంలోనే ఉండేటట్టు హేమమ్మ పనులు చెప్తూనే ఉండేది. తీరా నే దివాణంలో ఏమీ చేసేదిలేదు. ఒక రోజున నేను పువ్వుల తోటలో గొప్పిలు తవ్వుతున్నా. ఆమె నా దగ్గరకువచ్చి అంది, “ఎందు కంతకష్టం” అని. నే నామె ముఖంవైపు చూచేను-ఆమె అందం ఎంతటి వాడినైనా ముగ్ధుణ్ణి చేస్తుంది. కాని చేతులో ఉన్న పార నావృత్తిని తెలియచేసింది. “కష్టజీవులు సుఖపడ్డం ఎలా” అన్నాను. ఆమె చిరునవ్వు నవ్వింది. “నువ్వేం చదువుకోలేదూ ?” అంది. “ఏదో కొంచెం తెలుగు చదువుకున్నా. మా నాన్న భాగవత, భారత పురాణాలు చదివి అర్థం చేసుకొనేవాడిలా చేసేడు” అన్నా. “అయితే బాగానే చదివే వన్నమాట” అంది, కొంటెగా. నాకా సంభాషణ ఎలా నడుస్తోందో బోధపడలేదు. “చూడూ, యీచీర నాకు బాగుంటుందా?” అంది. “బట్టల సాణ్యం తెలీనివాడిని నన్నడిగితే నే నేం చెప్పను” అన్నా. “అది కాదు, నీకంటికి యీ చీరలో నేను అందంగా ఉన్నానా?” అంది. “నాకంటికే మీ రెలా ఉంటే ఏంపోయింది?” అన్నాను. “ఏదో చదువుకున్న వాడివి అన్నావు గదా. ఇంత మాత్రం అర్థం గ్రహించలేవూ?” అంది, నవ్వుతూ. ఆమె ఒకసారి నాల్గుమూలలా చూచింది. ఎవ్వరూ తోటలో లేరు. ‘నామాట వినవూ?’ అంది. ‘నన్నెక్కడికైనా తీసుకుపో. ఇద్దరం పారిపోదాం. నా నగలన్నీ పట్టుకువస్తాను. నువ్వూ నేనూ కలిసి హాయిగా ఏ పట్టణంలోనైనా స్వేచ్ఛగా కాలం గడుపుదాం. ఈ జనానా వదలి పోతుంది. ఈ చీకటిలోంచి యిద్దరం వెల్తురులోకి వెళ్దాం’ అంది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి, ఆ మాటలు చెప్తూఉంటే’. ‘మీకు వంట్లో బాగులేదు కాబోలు. ఇంట్లోకి వెళ్లండి” అని అక్కడనించి పైకి వచ్చేశాను.

ఆమె కోపం పట్టలేకపోయింది. తన ప్రేమను తిరస్కరించేను. అంతేకాకుండా నాదగ్గర వెలితి పడిపోయింది. తను జమీందారు బిడ్డ. జరిగిన పరాభవం ఆమెను దహించివైచింది. అదే ప్రారంభం మా కుటుంబనాశనానికి. కాని అదృష్టంవల్ల లచ్చికి వివాహం చేశాడు మాతండ్రి. నన్ను పెద్దబాబుగారు దివాణానికి పిలిచారు. “నువ్వు రైతుల నందరినీ రెచ్చగొడుతున్నావుట. మొన్న హేమమ్మ కారుమీద వెళ్తూఉంటే కారాపి, ఏవో నోటికి వచ్చినట్లు నీ తాలూకు జనం దూషించారుట” అన్నారు. నాకేం బోధపడలేదు, ఆ విషయం. కాని పరదాలోంచి తొంగి చూచింది, హేమమ్మ; వెంటనే అర్థంచేసుకున్నా విషయం. నే నేం చెప్పినా ఎవరూ వినేటట్టు కనిపించలేదక్కడ. నే నేమీ ఎరగనని చెప్పడానికి కూడా సందేహించేను, అక్కడ వారి ముఖభావాలను పట్టి. నా మౌనం చూచి అందరూ నన్ను దోషిక్రిందే కట్టేరు. నేను చాలా ఖిన్నుడనై దివాణంపైకివచ్చి తోట గోడంబటే నడుస్తున్నా. ‘ఇప్పుడైనా మించిపోయింది లేదు’ అన్నమాటలు వినిపించాయి. తోట గుమ్మందగ్గర హేమ నిలుచుంది. ఆసర్పాన్ని అక్కడ చూచేసరికి నాకు అసహ్యం కలిగి, ఆమె ముఖం చూడకుండా వెళ్ళిపోయేను.

నా తండ్రి అకస్మాత్తుగా చనిపోయేడు. నాకు ఉన్న ఎకరం పెద్దబాబు శిస్తుక్రింద తీసుకుని, నన్ను దివాణం నౌఖరుక్రింద ఉండమన్నాడు. నా కది ప్రాణసంకటమయింది. ఒకరోజున అర్థరాత్రి, తోట గుమ్మందగ్గర అలికిడైతే, ఏమి చెప్మా అని పరుగెత్తుకొని వెళ్లేను. హేమమ్మ ఎవరితోనో పారిపోవడానికి సిద్ధంగా ఉంది. నేను జాగుచేస్తే వీలులేదని ఆ వ్యక్తిని పట్టుకుందామని అతనిమీదికి వెళ్లేను. కాని నా పట్టు తప్పిపోయింది. అతని ప్రక్క వున్న హేమమ్మ చీరకొంగు నాచేతిలో చిక్కడ్డాది. ఆమె ప్రయత్నంచేసి విడిపించుకుందామనుకుంది. లాభం లేకపోయింది. ఆతొందరలో ఆవ్యక్తి నన్ను వదుల్చుకుందామని బాకుతీసి

పొడవబోయెను. పాపం- ఆదెబ్బ నాకు తగలక- చీరకొంగుకై గిజగిజలాడుతున్న హేమమ్మ వీపులో గుచ్చుకొంది. బలమైన పొడుపు అవడంమూలాన్ని ఆమె ఒక అరుపు అరిచి క్రిందకి పడిపోయింది. తనుచేసిన పొరబాటు గ్రహించి ఆవ్యక్తి వెంటనే పారిపోయాడు. నేను హేమను వదల్లేక అతడి వెంట పరిగెత్తలేదు. హేమమ్మ కేకకు అందరూ లేచారు. పెద్దబాబూ చిన్నబాబూ వచ్చేసరికి హేమమ్మ చనిపోయింది. నాపై హత్యానేరం ఆరోపించి మరణశిక్ష విధించారు. శిరీష్ మహాశయా, నాకు చావంటే భయంలేదు. కాని నిర్హేతుకంగా మరణం సంభవిస్తూంది. అదే విచారం!' అన్నాడు అపరాధి.

అపరాధి చరిత్రం ముగించగానే క్లాక్‌టవర్ అయిదుగంటలు కొట్టింది. "శిరీష్ మహాశయా, నాది ఒక కోరిక ఉంది. మీరు మన్నించాలి" అన్నాడు అపరాధి. "తప్పకుండా" అన్నా. "లచ్చితో నా తుది మాటగా, రైతుబిడ్డకు చావు లేదని చెప్పండి" అని నాతో యింక మాట్లాడ లేదు. అతన్ని చూసి నాకు ఆశ్చర్యం కలిగింది.

తెల్లవారింది. అపరాధిని ఉరిస్థానానికి తీసుకు వెళ్తున్నారు. నావైపు చూస్తాడేమో అనుకున్నా. కాని చూడలేదు. నేను మాత్రం యథాప్రకారంగా గదిలో దూరి, కప్పదగ్గరగా నొక్కి ఉంచి, నావిడుదలకై చూస్తున్నా. ఒక అరగంటకు అందరు ఉరిస్థలంనుండి తిరిగి వచ్చేరు. అపరాధి శరీరం ఒక వైపునుండి తీసుకుపోతున్నారు. జైలరు, జమాను నాగది దగ్గరకువచ్చి నన్ను విడుదల చేసేరు. జైలరు నన్ను చూచి అన్నాడు, "మిమ్మల్ని ఎక్కడో చూచేను!" అని. నన్ను తనకి ఎరిగించుకున్నాను. అతడు నాలిక కరచుకొని, చాలా వినయంగా క్షమాపణ కోరుతూ "దయఉంచి యిది మీరు పత్రికలో ప్రచురించకండేం!" అని వూరుకున్నాడు. ప్రక్కనుంచి జమాను నన్ను చూచేడు. ఆతనిచూపు గ్రహించి నవ్వుకున్నా. ఏడుకొట్టింది, జైలుపైకి వచ్చేసరికి.

# ప్రజాప్రభుత్వమా?

స్వతంత్ర భారతంలో ఒక వసంతము బహు హైన్యముగా, పోలీసులాటీల భయంతో నరబలి కోరే శాంతిరక్షణ చట్టాలక్రింద ఎట్లాగో దొర్లించింది ప్రజానీకము. కాంగ్రెసు పరిపాలనా రథానికి సారథ్యము వహించి ప్రజానీకాన్ని కలవరపరుస్తున్న అంధకారము మరింత దట్టము చేసింది. ఎటు చూచినా ప్రజలో నిరాశ వ్యాపించింది. ప్రజాభిమతాన్ని పూర్తిగా విస్మరించి వారి హక్కులను గంగపాలు చేస్తున్న ప్రజాప్రభుత్వాలు, కూటి గుడ్డల కాటకాన్ని అరికట్టలేక కళ్లుమూసుకొని కలవరపడుచున్న కాంగ్రెసు మంత్రివర్గాలు, కులతత్వ వాదాలతో సాంఘికజీవితాన్ని కలుషితం చేస్తున్న అధికార అనధికార కాంగ్రెసువాదులు నేడు ప్రజలలో చెలరేగిన నిరాశకు ముఖ్య కారణాలు.

ప్రజలకూ ప్రభుత్వాలకూ యెట్టి సంబంధమూ లేదు. ప్రజాప్రతినిధుల ప్రభుత్వాలు యెన్నికలు తిరిగి జరుపుటలో చూపుతున్న ఉత్సాహము వారి ప్రజాప్రాతినిధ్యాన్ని యెంతవరకూ ఋజువు చేయగలదో తెలియుచునే యున్నది. ఇతర రాజకీయ పార్టీల మనుగడ కాంగ్రెసుకు భరింప శక్యము గాకున్నది. బాహాటముగా కమ్యూనిష్టులను కొంచెము హెచ్చుతగ్గులలో సోషలిష్టులను నిర్బంధిస్తుంది కాంగ్రెసు ప్రజాప్రభుత్వము. ప్రజారక్షణ పేరుతో వ్యక్తిస్వాతంత్ర్యాన్ని నాశనము చేస్తున్న ప్రజాప్రభుత్వాల నేమనాలో తెలియుట లేదు.

వ్యక్తిస్వాతంత్ర్యాన్ని భంగపరిచే యేశక్తినైనా రూపుమాప వలసిందే. అప్పుడుకాని దేశానికి అభ్యుదయం కలుగదు. కులతత్వ వాదాలతో క్రుళ్లిపోతున్న కాంగ్రెస్సు క్షాళనం కావలసిందే. పదవీవ్యామోహపరులను పరీక్షించి పారద్రోల వలసిందే. ప్రజలకు కూడుగుడ్డల నీయలేని ప్రభుత్వాలు పదవీపరిత్యాగం చేయవలసిందే! తిరిగి నూతనంగా యెన్నికలు జరిపించి తీరవలసిందే! అప్పుడు స్వార్థ రహిత ప్రజాప్రతినిధులు ప్రజాప్రభుత్వాన్ని నిర్మించగలరు. నేటి ప్రభుత్వాలు ప్రజాప్రభుత్వాలనుకొనుట వట్టిభ్రమ.

యమ్. ఆర్. కృష్ణ